**ఉదయం** విడవకుండా వాన కురుస్తూంది.

బయట గాలి తాకిడికి జుయ్యి మని చెట్ల ఆకుల శబ్దం పోలీసు విజిల్స్ లాగ వినపడుతూంది. రోడ్డు మీద మోకాలు లోతున నీళ్ళు గలగల మని జారి పోతున్నాయి. రావు మఫ్లర్ మెడకు చుట్టుకొని, పైపు నోట్లో పెట్టుకుని, రెండు చేతుల్ని పాంట్ జేబుల్లో కుక్కి, కిటికీ చువ్వల గుండా బయటికి చూస్తున్నాడు. అతగాడు మహాంచి హుషారుగా ఉన్నప్పుడో, భార్యను హింస పెట్టి అనుకున్నదేదో సాధించి నప్పుడో అలా పాంట్ జేబులో రెండు చేతులూ పెట్టుకుంటాడు.

ఈ వేళ భార్యనుంచి చాలా సాధించాడు. ఏడు రోజుల ముసురులాగా ఆవిణ్ణి వసపెట్టి, తిట్టి, రోజూ పరీక్షించడానికి రావలసిన డాక్టర్ని రానివ్వకుండా, మందులు అందనీయకుండా, కొట్టడం మినహా మానవుడు ఎన్ని రకాలు చేయగలడో అన్ని రకాల హింసలూ పూర్తి చేసి చెక్కుమీద సంతకం తీసుకున్నాడు.

హోరున వానలో ఆవిడ కన్నీళ్ళు కలిసిపోయినాయి. బిగుసుకుపోయి, చెమటలు ధారగా పోస్తూంటే ఫాన్ క్రింద అలాగే కూర్చుండిపోయింది కల్యాణి. ఆవిడ కళ్ళు కణకణ మండే నిప్పుల్లా ఎర్రగా వెలిగి పోతున్నాయి. మొహం వాడిపోయి ఉంది. కాని, ఆ మొహంలో ఒక విధమైన మొండితనం, జుగుప్స నిండి ఉన్నాయి. చాలా సంవత్సరాలుగా ఆమె అతగాడి బాధలన్నీ భరిస్తూ వచ్చింది. తనకోసం కాదు. వివాహమైన కొత్తలో తమ ప్రేమ ఫలంగా జన్మించిన కుమార్తె కోసం. తను లేకపోతే పిల్ల అన్యాయమై పోతుందేమోననే భయంతో భర్త క్రౌర్యానికి, కుటిలత్వానికి బలి అయి అశక్తురాలైన భార్య లాగు బ్రతుకుతూంది.

బజ్జరు నొక్కింది. పని మనిషి రాగానే అగ్గిపెట్టె తీసుకుని రమ్మంది. ఈ లోపున ఆలస్యాన్ని సహించలేని దానిలాగు కూతుర్ని పిలిచింది. ఈ హడావిడి చూసి రావు పైపు చేత్తో పట్టుకొని గదిలోకి వచ్చి టేబుల్ దగ్గర కూర్చుని భార్యవంక చూశాడు.

భయంకరమైన కళ్ళు. చిరుతపులి పగలాంటి కళ్ళు. మిలమిల మెరిసే కళ్ళు. రక్తాన్ని నింపుకున్నవి. ఆ కళ్ళలో కసి, ద్వేషం, అసహ్యం నిండి ఉన్నాయి. ఆ చూపులు భరించలేక టేబుల్ మీదికి దృష్టి సారించి పక్కనే ఉన్న ప్లేటు ముందుకు జరుపుకొని, ఎదురుగా డబ్బాలో ఉన్న కేకు ప్లేటులో పెట్టుకున్నాడు రావు.

పనిమనిషి అగ్గిపెట్టె తెచ్చింది.

కూతురు వచ్చి, "ఏం కావాలమ్మా?" అంది.

అడిగిన కూతురు వంక నిండార్లయిన ఎర్రబడ్డ కళ్ళతో అచేతనంగా చూసింది.

పనిమనిషి — "ఇదిగోనమ్మా, అగ్గిపెట్టె" అంది.

కూతురు తల్లి పక్కకు వచ్చి, "నీవు అలా చూడకమ్మా. నాకు భయం వేస్తుంది" అంటూ భుజం పట్టుకుని ఊపింది.

రావు ఓరగా చూస్తున్నాడు.

ఉలిక్కిపడి, "ఏమిటమ్మా?" అని ఆప్యాయంగా అడిగింది కూతుర్ని.

రావు కేకును నాజూకుగా కొద్ది కొద్దిగా కొరుకుతున్నాడు.

టేబుల్ దగ్గర ఉన్న భర్త వంక చూసింది. కడుపులో తిప్పినట్లయింది.

"ఇదుగో, అగ్గిపెట్టె" అన్న పనిమనిషితో— "అయ్యగారికి టీ ఇవ్వు" అంది. కూతుర్ని తనతో రమ్మని చక్రాల బండి నెట్టుకుంటూ బీరువా దగ్గరికి వెళ్ళింది.

రావు టీ తీసుకోకుండా లేచి, "రాత్రికి బొంబే వెళుతున్నాను. అన్నీ సర్దించు" అంటూ అవతలికి వెళ్ళాడు.

వీల్ ఛైర్ పక్కకు పెట్టుకుని, కుమార్తెను దగ్గరికి పిలిచి తన పెళ్ళి చూపుల నుంచి, కుమార్తె పుట్టిన దాకా జ్ఞాపక చిహ్నాలుగా పదిలంగా దాచుకొన్న వన్నీ అరలోనుంచి కిందికి దింపించింది.

కూతురు అన్నీ చేస్తుకుంటూ పోతూంటే— "చిన్నీ! నేను చెప్పేవన్నీ విను. మగవాళ్ళ నెప్పుడూ నమ్మకమ్మా" అంటూ, చేతిలో ఉన్న ఫోటో చూపిస్తూ, "ఇదిగో, మీ అమ్మమ్మ, తాతయ్య, నీ నలుగురు మామలు" అంది.

"మరి మామయ్యలు మన ఇంటికి రారేమమ్మా?" అడిగింది కూతురు అమాయకంగా.

నిట్టూరుస్తూ, "వాళ్ళు రారమ్మా. మీ నాన్న నన్ను ఎవరికీ కాకుండా చేశారు. వాళ్ళకు అభిమానముంది. రారు — రా" రంటూ పిచ్చి పిచ్చిగా జుట్టు పీక్కుంది. పక్కనున్న పని అవ్వ రెండు చేతులూ పట్టుకొని, "నా మాట విను, తల్లీ! అవన్నీ చూడకు" అంటూ బతిమాలింది.


అది కల్యాణి పుట్టిన దగ్గరి నుంచి తోడు ఉంటూ పని వచ్చిన మనిషి. చిన్నప్పటి నుంచి కల్యాణిని పెంచింది. ఎవరన్నా పేరు పెట్టి పిలిస్తే మొట మొటలాడుతూ, "చిన్న దొరసానని పిలువలేరూ?" అనుకుంటూ చాటుకు వెళ్ళి మెటికలు విరుచుకునేది. కల్యాణిని అత్తవారి ఇంటికి పంపుతూంటే— "వెళ్ళి పోవు, చిన్నమ్మా!" అంటూ వాటేసుకుని ఏడ్చింది. అందరూ కొప్పడితే వదిలింది. తరవాత కల్యాణే కదిలింది. కల్యాణి దగ్గరి నుంచి ఉత్తరం రావటం ఆలస్యం అయితే రోజులు లెక్క వేసుకొని పెద్దమ్మగార్ని సాధించేది. కల్యాణి కనటానికి వస్తే కంటి రెప్పలాగు కన్నతల్లి కన్నా మిన్నగా చూసుకునేది. తల్లి దాని పనులు చూసి, "పిచ్చిముండ!" అని ముసిముసినవ్వులు నవ్వుకునేది.

దిగాలుగా ఉంటున్న కల్యాణిని చూసి అనామనించి పెద్దమ్మగారి చెవి కొరికింది. "ప్రేమ ఎక్కువైతే నీవు అన్నీ అలాగే కనపడతా" వని విసుక్కుంది అమ్మగారు. ఇదివరలో లాగ రావు రాలేదని అందరి దృష్టిలో పడినా పసిపాప కేరింతల్లో మరుగున పడిపోయింది. రావు వచ్చి కల్యాణిని తీసుకు వెళుతున్నాడు. పసిపిల్ల తల్లి అని పని అవ్వను తోడిచ్చి పంపుతూంటే, "మా అమ్మాయికి మా ఇంట్లో ఏమీ కష్టం కలగదు లెండి. అయినా ఎవరి పనులు వారు చూసుకోకపోతే ఎలా?" అంటూ నిరాకరించాడు.

అత్తింటికి వెళ్ళిన కల్యాణి దగ్గరి నుంచి వారానికి వచ్చే ఉత్తరం పదిహేను రోజు లయ్యేది. ఆ తరవాత నెమ్మదిగా నెలకో, రెండు నెలలకో ఒకటి వచ్చేది. అయ్యగారు, అమ్మగారు వినేటట్టు పని అవ్వ— "అమ్మాయిగారి దగ్గర నుంచి ఉత్తరం రాలే" దని వసపెట్టేది. తల్లి కూడా పసిపిల్లతో కుదరలేదేమో అని సమర్థించుకునేది.

అనుకోకుండా— "సీరియస్. రమ్మని" అన్న టెలిగ్రాం అందుకుని, అందరూ రెక్కలు కట్టుకుని వాలారు. కల్యాణి హాస్పిటల్లో ఉంది. ఆరు నెలల పసిపాపకు ఆలనా పాలనా లేదు. కొడుకు పనులు చూడలేక రావు తల్లి తమ ఊళ్ళోకి వెళ్ళింది. "పసిపిల్లతో ఒక్కదాన్ని ఉండలేను. ఎవరినన్నా తోడు పెట్టు" మని ప్రాధేయపడితే — "చూద్దాం" అన్నాడు రావు. చూస్తూనే ఉన్నాడు. వివాహమైన రోజుల్లో ఉన్న ప్రేమ ఇప్పుడే మయిందమ్మా అని విస్తుపోయింది కల్యాణి మనసు. మళ్ళీ పోరు పెట్టి రించింది రావును.

"సరే" నంటూ ఎవరినో తెచ్చి పెట్టాడు. దానికి పక్క గది. ప్రత్యేకంగా ఆవిడకోసం అన్నీ ఎవరో కొనాలి, వెళ్ళాలి.




కళ్యాణి కోరుకున్నది ఇలాంటి తోడు కాదు. తన దగ్గర అయిదు నిమిషాలు కూర్చోవాలంటే విసుగుపడే రావు ఆ గదిలో ఆవిడతో ఇరవై నాలుగు గంటలూ గడుపుతున్నాడు. ఇంకా సమయం చాలక రోజులు పొడవు ఎదిగి, దినానికి గంటలు ఎక్కువయితే బాగుండు ననుకుంటున్నాడు. ఒక రోజున బిడ్డ పాకుతూ వెళ్ళి ఆవిడ గదిలో మూత్రం పోసిందని, తెట్టు తేలేటట్టు బాది ఇవతల పడేసి వెళ్ళింది. అన్నిటికీ సహించిన కళ్యాణి ఇది సహించలేక పోయింది. దాని ఫలితంగా రావు రాగానే ఒళ్ళు హూనమైంది.

ఆ బెంగతో మంచం ఎక్కింది కళ్యాణి. చాకిరీ చేయటానికి ఎవరూ లేరు. ఆవిడ విసుక్కుంటూ

# చిరంత కళ్ళు

–ఊలాపు బాలకేశవులు



పిల్ల మోహన కాసిని పాలు పోసి హోటల్ నుండి కారేజీ తెప్పించేది. ఒక రోజున ఆవిడ—"నీ ఇంటి చాకిరి చేయడానికి రాలే" దని మోహన చెప్పింది. రావు జబర్దస్తీకి భయపడి కళ్యాణి లేచి నెమ్మదిగా పనిచేయటం ప్రారంభించింది. బలహీనత మూలంగా ఒక రోజు స్టౌ మీద తూలిపడి సగం చీర కాలి హైరాన పడింది. రావు కాస్త భయపడినా, మళ్ళీ మామూలుగా ఉన్నాడు. ఇంట్లో ఆవిడ అధికారం నాటిపోటి మాటలు తక్కువైనవి. కళ్యాణి బల హీనత మూర్ఛల్లోకే దింపింది.

రోగడ రావు స్నేహితులు — "మీ ఆవిణ్ణి పార్టీలకు తీసుకురావేం?" అంటే అప్పుడు— "పసిబిడ్డ తల్లి" అన్నవాడెల్లా ఇప్పుడు మూర్ఛ:ని చెబుతున్నాడు. ఒక రోజు మెట్లు ఎక్కుతూ ఫిట్ వచ్చి కింద పడిపోయింది. పసిపిల్ల ఏడుపు విని పక్క ఇంటి వారు వచ్చి డాక్టర్ని పిలుచుకు వచ్చారు. తెలివి అయితే వచ్చింది కాని, కాళ్ళూ చేయీ కదలలేదు. వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్ళమన్నారు. ఆ కాస్త పనిచేసి ఆ కాస్త పుణ్యం పక్క ఇంటి వాళ్ళు దక్కించుకొని పసిపిల్లను దగ్గర ఉంచుకున్నారు. ఇంత జరిగినా ఆవిడ గదిలోనుంచి బయటికి రాలేదు. రాత్రికి రావు వచ్చిన తరవాత ఆ ఇంట్లో చాలా పొద్దుపోయేదాకా లైటు వెలగటం చూశాడు పక్క ఇంటాయన. ఆయనే అల్లుడి పేరిట టెలిగ్రాం ఇచ్చాడు.

అకస్మాత్తుగా దిగిన అత్త మామల్ని, బావ మరదుల్ని చూడగానే కంగు తిని, "మీ రెందుకు వచ్చా" రన్నాడు. జేబులో టెలిగ్రాం చూపించాడు బావమరిది. ఇంట్లో ఉన్న ఆవిడ ఎవరని అత్తగారు అడిగింది. "టైపిస్టు" అంటూ సమాధానం చెప్పాడు. పక్క ఇంటి వారు పిల్లను తీసుకు వచ్చి అప్పచెప్పారు. వాళ్ళను చూడగానే రావు లోపలికి తప్పుకున్నాడు. జరిగినదంతా చెప్పాడు పొరిగింటాయన. అంతా విని అందరూ కలిపి హాస్పిటల్‌కు వెళ్ళారు.

తన వాళ్ళను చూసి కన్నీళ్ళు నింపు కుంది కళ్యాణి. బక్కచిక్కి బల్లిలాగు మంచానికి అంటుకు పోయింది. తండ్రి, అన్న లోని కెళ్ళి డాక్టర్ని సంప్రదించి వచ్చారు. "కాళ్ళూ, నడుమూ, నరాలూ దెబ్బ తిన్నవి. మేము చేయవలసినదంతా చేశాము" అని చెప్పారు వాళ్ళు. కళ్యాణిని ఇంటికి తీసుకువెళ్ళేదాకా పని అవ్వ మంచాన్ని అంటి పెట్టుకుని ఉంది. ముద్ద ఎత్తలేదు. ఇంటికి వెళ్ళేటప్పటికి ఆవిడ లేదు. ఏదని అడిగితే — "మీరు వచ్చారని పంపాను. కళ్యాణికి సాయమని తెచ్చాను" అన్నాడు అల్లుడు. ఆతగాడి వ్యాపార మేమిటో, ఏం చేస్తూ ఉంటాడో మామగారికి కూడా తెలియదు. పెళ్ళి కాగానే చేస్తున్న ఉద్యోగం వదిలేశాడు. ఫోర్జరీ సంతకాల మూలంగా వాళ్ళు పీకేశారని ఒక వదంతి.

కళ్యాణిని ఇంటికి తీసుకు వచ్చి పని అవ్వను తోడు పెట్టి వెళ్ళారు. తల్లీ, తండ్రీ, పనిమనిషీ, అన్నీ తనే అయి సాకుతూంది పని అవ్వ కళ్యాణిని. అప్పటి నుంచి జీవచ్ఛవం లాగా బ్రతుకుతూంది.

టైపిస్టును తీసుకువెళ్ళి బాంబే, పూనా, ఢిల్లీ అంటూ బాంబేలో సెటిల్ చేసి అక్కడ కాపురం వెలగ బెడుతున్నాడు రావు.

కళ్యాణి ఆర్థికంగా ఎక్కడ ఇబ్బంది పడుతుందో నని తండ్రి ఆమె పేర కొంత ఆస్తి, డబ్బూ వ్రాసి ఈ మధ్యనే చనిపోయాడు. అన్నలు నలుగురి ఆప్యాయత ఏమీ తగ్గలేదు. మేనకోడలు పని అవ్వ చేతిలో పూవు లాగు పెరుగుతూంది. ఖర్చులు ఎక్కువైనప్పుడెల్లా రావు ఇంటికి వచ్చి ఈవిణ్ణి బాధించి డబ్బులు తీసుకు వెళ్ళడం రివాజు. ఆవిడ తాళికట్టిన భర్తలో ఇంత అమానుషత్వం ఉంటుం దనుకోలేదు. పిల్ల పెద్దది అవుతూంది. కాస్త ఇంటిపట్టున ఉండి ఉంటే పోట్లాట పెట్టుకోవడం, ఈ లోపు ఆవిడకు ఫిట్లు రావడం — ఇదిగో, అదిగో వస్తానని ఈయన ఊరు వెళ్ళడం, పని అవ్వ సతమత మయి దానికి తేవటం — ఇలా ఉంది.

వారం రోజుల నుండి జరుగుతున్న యుద్ధకాండ ఈ వేళ చివరి అంకానికి వచ్చింది. రావు బాంబే వెళు తున్నాడు. అడ్డు పెట్టినా వెళ్ళి తీరతాడు. ఏదో నిశ్చయానికి వచ్చినట్లు చెక్ మీద సంతకం పెట్టింది. డబ్బుకోసం పనిమనిషిని పంపాడు రావు.

బీరువా దగ్గర అన్నీ కూతురు తీసి పేరుస్తూంటే వాటి వంక — ఆప్యాయంగా, ఇక ఈ జన్మలో


# పై పై చికిత్సలు మొటిమల మూలకారణాన్ని పోగొట్టలేవు.

యోగా లాగానే రక్త దోషాంతక్ అంతర్గత ప్రశాంతతను కలిగిస్తుంది.
మొటిమలు లేని అందాన్ని యిస్తుంది.

రక్తదోషాంతక్ యోగా లాగానే గొప్ప సాంప్రదాయం గల ఆయుర్వేదం నుంచి తయారైంది. మొటిమలు, చిడుము, చర్మంమీద మచ్చలు : ఈ వ్యాధుల బాహ్య లక్షణాలను పోగొట్టటంకంటె వాటి మూలకారణాన్ని కనుక్కోవటం ముఖ్యం

**అసమన్వయం** : యోగా లాగానే రక్తదోషాంతక్ కూడా శరీరపు పనులలోని అంతర్గత అసమన్వయం రక్తాన్ని మలినం చేస్తుందని నమ్ముతుంది. ఈ రక్త మాలిన్యమే అందాన్ని పాడుచేసే మచ్చలను చర్మంమీద కలిగిస్తుంది. ఈ సమస్యకి ఆయుర్వేదపు అన్వేషణ ప్రకృతి సిద్ధమైన ఉపశమనతో కూడిన సమాధానాన్ని కను. గొంది — మూలికలతో కూడిన అంతర్గతమైన చికిత్స. అదే రక్తదోషాంతక్.



**సమన్వయాన్ని కలిగించటం**: మీ విశ్వాసానికి పాత్రమైన యీ అయు ర్వేదపు మందు లోని మూలికలు, జీర్ణ క్రియ, బాహ్యక్రియ. రక్త ప్రసరణ వంటి శరీరంచేసే ముఖ్యమైన పనులను సరిచేసి మీకు అంతర్గత ప్రశాంతతను, చర్మ సౌందర్యాన్ని కలిగిస్తాయి. కానీ, ప్రతిరోజూ చెప్పబడిన మోతాదులో రక్త దోషాంతక్‌ను వాడి తీరాలి. అంతేకాదు. మీ చర్మం సహజ సౌందర్యాన్ని పొందాక కూడా యింకా కొంతకాలం యీ చికిత్సను కొన సాగించటం ఎంతో ముఖ్యం. మీ శరీరం అంతర్గత ప్రశాంతతను తనంతట తానే కలిగించుకునేవరకూ.

## రక్త దోషాంతక్
మచ్చలు లేని చర్మ సౌందర్యానికి,
నికార్సైన ఆయుర్వేదపు రక్త శుద్ధ కారిణి




అఫాలి
ఫార్మస్యూటికల్స్
లిమిటెడ్
1184/4. శివాజీనగర్.
పూనా 411005
టెలిఫోన్ నం. 51108.

everest/80/APL/428/tl

## చిత్రగీతి

-టి. చంద్రశేఖర రెడ్డి

ఒంటరి తనం గీసి
అంటిస్తే వాలు
మంటలై వెంటపడే
గత జీవిత
స్మృతి వలయా లొక వైపూ—
ఏకాంత కాంత
ఆశా రవిని
ప్రసవిస్తే వాలు
కాంతికిరణాలై ప్రసరించే
భావి జీవన
స్వప్న వర్తులాలు మరొక వైపూ—
చీకటి వెలుగుల
చెరిసగపు పరిష్వంగంలో
మధ్యలో
రథ్య తెలియక
రెక్క లెత్తుకుని— నేను !



చూడలేనేమో అన్నంత తమకంగా చూస్తూంది.

"తండ్రిని పిలుచుకు ర"మ్మని కుమార్తెకు చెప్పింది.

రావు వచ్చాడు.

"ఒక నాటి మన ప్రేమకు జ్ఞాపకాలు" అంటూ నవ్వింది. ఆ నవ్వులో సముద్రపు హోరు విన పడింది. ఆ మెరిసే కళ్ళలో పిచ్చి చూపు కనబడింది.

"చూడండి" అంటూ బలవంతంగా రావుకు ఒక్కటొక్కటే చూపిస్తూంటే ముళ్ళమీద కూర్చున్నట్లుంది. అవన్నీ జ్ఞాపకం చేసుకోవటం ఇష్టంలేదు రావుకు. వివాహం కాగానే ఇద్దరికీ కలిసి తీసిన ఫోటోను రెప్ప వేయకుండా— "చూడు—చూడు" అంటూ భర్త ముందు పెట్టింది. అతను ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

అదిచూసి, "ఇది చూడడానికి భయపడుతున్నారా?" అంటూ పిచ్చిగా నవ్వింది. ఆ ఫోటో ఒడిలో పెట్టుకుని పక్కనున్న అగ్గిపెట్టె నందుకుని ఒక్కటొక్కటే తగల పెట్టడం ప్రారంభించింది. పని అవ్వ అడ్డుపడబోయింది. ఉరిమి చూసింది పని అవ్వను. ఆ మంటల వెలుగులో ఆమె మొహం నిప్పు పువ్వులా భయంకరంగా కనబడింది. మంటను చూసి పకీ పకీ నవ్వింది.

నవ్వు ఆపలేదు.

ఏడ్చింది. ఏడ్పు ఆగలేదు.

నవ్వుతూ ఉంది. ఏడుస్తూ ఉంది. మాటి మాటికి ఫోటో చూస్తూ హృదయానికి హత్తుకుంటూ ఉంది. పని అవ్వ ఆమె చేతిలోనుంచి ఫోటో లాగాలని చూసింది. పువ్వులాంటి చేతులు కొయ్య ముక్క లయినాయి.

పని అవ్వ భయపడుతూ, "అయ్యగారూ! మళ్ళీ ఫిట్ వచ్చినట్టుంది" అంది. ఇంతలో కుర్రవాడు డబ్బు తెచ్చాడు. డబ్బు అందుకుంటూ పని అవ్వ మాట విని, "చావనీ!" అంటూ వరండాలో బాల్కనీ దగ్గరికి వెళ్ళాడు. ఈ సారి భార్యను చూస్తూంటే ఎందుకనో రావు శరీరం వణకుతూంది.

నవ్వుతూ ఉంది, ఏడుస్తూ ఉంది కళ్యాణి. మధ్య మధ్య గుప్పెళ్ళు బిగించి గుండెమీద బాదు కుంటూంది. జుట్టు పీక్కుంటూంది. ఏడుపు ఆప లేదు కళ్యాణి. నవ్వాపలేదు కళ్యాణి. రెండూ కలిపి అమావాస్య నాటి సముద్రపు హోరు లాగా రావు మనసు పరుగులెత్తించేస్తున్నాయి. కుమార్తె బీరువా వంక, తల్లి చేతిలో ఫోటో వంక ఆశ్చర్యంగా చూస్తూంది. పని అవ్వ కళ్ళు తుడుచుకుంటూ ఉంది. ఒడిలో ఫోటో పెట్టుకుని బండి నెట్టు కుంటూ వరండాలో రావు దగ్గరికి వెళ్ళింది కల్యాణి.

జుట్టు పీక్కుంటూ ఉంటే నిప్పు పువ్వులోని కేసరాల్లాగా పాయలు పాయలుగా విడిపోయింది. ఎర్రని బొట్టు రక్త జ్వాల లాగు మొహమంతా అలుక్కుంది.

దగ్గరికి వెళ్ళి రావు చెయ్యి పట్టి కుదుపుతూ— "చూడు, మన పెళ్ళి ఫోటో చూడు. ఆ నాటి నీ ప్రేమనంతా ఎక్కడ దాచావు, చెప్పు?" అంటూ అరిచింది. గుండెలు బాదుకుంటూ ఏడ్చింది. రావు వంక నిశ్చలంగా చూసింది. తనవైపు బెదురుగా చూస్తున్న రావును, "నన్ను నన్నుగానే చూడ! నాలో అవిన్నీ చూడ" కంటూ భోరుమని ఏడ్చింది. కసి, కావేశం, జుగుప్స, ప్రేమ తన్నుకురాగా భర్త వంక దీక్షగా చూసింది. అతను బయటికి చూస్తున్నాడు.

వర్షపు నీరు తీసింది. నేలంతా కడిగిన ముత్యం లాగా స్ఫుటంగా మెరుస్తూంది. చల్లని గాలి రివ్వున వీస్తూంది.

నవ్వింది కళ్యాణి.

ఏడ్చింది కళ్యాణి.

లాలనగా భర్త వంక చూసింది కళ్యాణి.

పగలబడి నవ్వింది. నవ్వీ నవ్వీ, "మీకూ, నాకూ ఇలాంటి వాతావరణం అంటే ఇష్టం కదూ? ఇట్లాంటప్పుడు చెట్టాపట్టా లేసుకుని చాలా దూరం తిరిగేవాళ్ళం" అంటూ పిచ్చి బలంతో బాల్కనీ క్రిందికి తోసింది రావును. ఇన్ని సంవత్సరాలుగా రాని కాళ్ళూ, నడుమూ ఎలా వచ్చినవో — ఆశ్చర్యం!

ఆ తోపుకి నిల దొక్కుకోలేక వెర్రికేక వేసి క్రిందికి పడిపోయాడు రావు. ఆ ఊపుకి తట్టుకోలేక కళ్యాణి కిందికి పడిపోయింది. కళ్యాణి చేతిలో ఫోటో ఇద్దరి మధ్యా పడింది. రావు జేబులో నోట్లు తొంగి చూస్తున్నాయి.

రావు అరుపుకి పని అవ్వ పరుగెత్తుకు వచ్చింది. గుండె బాదుకుంటూ పది మందినీ కేకేసుకువచ్చింది.

వచ్చీరాని తెలివిలో భర్త మెడను వాటేసుకుంది కళ్యాణి. రావు తల పగిలి రక్తం ఇద్దరి చుట్టూ అలుముకుంది.

గోలుగోలున ఏడుస్తూ, "చిన్నమ్మా!" అంటూ కళ్యాణి కూతుర్ని హృదయానికి హత్తుకుంది.

ఎర్రని చిక్కని రక్తంలో రెండు జీవాలు. అందులో ఒక రక్తంలో దౌర్జన్యం, మోసం, కల్మషం ఉన్నాయి.

రెండవది మమత, ఆప్యాయత, తనను తను బలిచేసుకో గల శక్తి గలది. రెండూ కలిసినాయి.

నిప్పు పూవులాగు ఆ రక్తపు మడుగులో కళ్యాణి మొహం భాసించింది.

రెండు రక్తాల కలయికే — నిప్పు పువ్వు.

నిటారుగా నిలబడి అరవిచ్చుకున్న అగ్నిజ్వాల లాగా కాంతి విరజిమ్మింది ...